క్లుప్తంగా

ఎండలో విక్రయిస్తూ..



తాటిముంజలు విక్రయిస్తున్న చిరు వ్యాపారి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకేంద్రంలో నాలుగు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. ఆసిఫాబాద్‌లో ఆదివారం 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండతీవ్రతకు జనాలు బయటకు రాలేదు. అయితే చిరు వ్యాపారాలు దేరాలు ఏర్పాటు చేసుకుని తాటిముంజలు, కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు విక్రయిస్తున్నారు.

షెడ్లు ప్రారంభం

జన్నారం: మండలంలోని కవ్వాల్ పోచమ్మ తల్లి ఆలయం వద్ద మతాలకు అతీతంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షెడ్ల నిర్మాణం చేశారు. ప్రతీ వారంలో ఆది, గురు వారాలు అత్యధిక సంఖ్యలో భక్తులు పోచమ్మ ఆలయానికి వస్తున్నందునా, సౌకర్యాలు లేని ఆ ప్రాంతంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో షెడ్ల నిర్మాణం చేసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ గల్ఫ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆసిఫాబాద్: జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు బానోత్ గోపాల్‌నాయక్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు నివాసంలో పార్టీలో చేరగా, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి



మాట్లాడుతున్న నాయకులు

జైనూర్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని గిరిజనేతరుల సంఘం, వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్ వాగ్మరే, వెంకట్ ముండే అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో ఆదివారం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగంతో రిజర్వేషన్లు పొందుతున్నామన్నారు. అనంతరం బాబా సాహెబ్ అంబేద్కర్ చరిత్రను కవ్వాలి రూపంలోని ఆలపించారు. మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కమి టీ సభ్యులు బాబాసాహెబ్, అశోక్, వంజరి సంఘం రాష్ట్ర కార్యదర్శి డోంగ్రే సమాధాన్, మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహిళే దత్తా తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపు ప్రమాదకరం..!



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రామన్‌కాలనీ వద్ద కేకే1 గని సమీపంలో రైల్వే ట్రాక్‌పై నిర్మించిన కోల్‌బెల్ట్ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి వర్క్‌షాపు మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వేట్రాక్‌పై సుమారు 45–50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి చాలా బలహీనంగా మారడంతో దాని పక్కనే నూతన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. కొత్త బ్రిడ్జిపై వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, పాత బ్రిడ్జిపై రాకపోకలు జరగకుండా అధికారులు రోడ్డును కట్ చేశారు. రోడ్డు కట్ చేసిన విషయం కొంతమంది వాహనదారులకు తెలియకపోవడంతో అక్కడి వరకు వెళ్లి వెనుదిరుగుతున్నారు. అధికారులు రోడ్డు క్లోజ్ అనే బోర్డు పెట్టినట్‌లైతే వాహనదారులు అలా వెళ్లే అవకాశం ఉండదని వాహనదారులు పేర్కొంటున్నారు.

‘పింఛన్’ పాట్లు..!

- ‘గిరి’ గ్రామాలకు తప్పని తిప్పలు
- నగదు కోసం 15 కిలోమీటర్ల ప్రయాణం
- మండుతున్న ఎండలతో అవస్థలు



మండల కేంద్రంలో పింఛన్ నగదు కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

పెంచికల్‌పేట్: ప్రభుత్వం వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు అందిస్తున్న పింఛన్ల కోసం గిరి గ్రామాల్లోని లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మురళీగూడ, కమ్మర్‌గాం గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ప్రతి నెలా మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు పింఛన్ల కోసం వెళ్లాల్సి వస్తోంది. ఎండాకాలంలో పింఛన్ కోసం సుమారు 30 కిలోమీటర్లు ప్రయాణం చేయడం కష్టంగా ఉందని వృద్ధులు వాపోతున్నారు.

గిరిజన గ్రామాలకు..

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు మురళీగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం, నందిగామ, గుండెపల్లి గ్రామాల్లో 240 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఆయా గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేనందున పింఛన్ కోసం లబ్ధిదారులు మండల కేంద్రానికి రావాల్సి వస్తుంది. గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రంలో సుమారు 15కిలోమీటర్లు ఉండగా రానుపోను సుమారు 30కిలోమీటర్ల దూరం ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రతి నెలా పింఛను కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండుతున్న ఎండలు..

గత నెల రోజులుగా ఎండలు మండిపోతుండటంతో పింఛన్ కోసం వెళ్లే లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎండ నుంచి ఉపశమనం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు చెట్ల కింద సేదతీరుతున్నారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు



ప్రతీ నెలా పింఛను కోసం ప్రైవేటు వాహనాల్లో మండల కేంద్రానికి వెళ్తున్నాం. గ్రామంలోని పింఛన్‌దారులు అందరం ప్రైవేటు వాహనానికి గ్రామం నుంచి రానుపోను చార్జీల కింద ఒక్కొక్కరి చొప్పున రూ.150 చెల్లిస్తున్నాం. కాలం ఏదైనా పింఛన్ కోసం మాకు తిప్పలు తప్పడం లేదు.

– కామెర పోశన్న, మురళీగూడ

ఇబ్బందులు పడుతున్నాం



పింఛన్ కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల కేంద్రంలోనే ఉంటున్నాం. వృద్ధుల వేలిముద్రలు పడక పింఛన్లు తొందరగా ఇవ్వడం లేదు. పింఛన్ల పంపిణీ దగ్గర ఎండ తీవ్రత తట్టుకోలేకపోతున్నాం. చెట్ల కింద సేదతీరుతున్నాం. అధికారులు స్పందించి గ్రామంలోనే పింఛన్లు అందించే ఏర్పాట్లు చేయాలి.

– కనక హంసుబాయి, జిల్లెడ

బాబా ఆలయ నిర్మాణానికి నిధులు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

జైనూర్: పూలాజీబాబా బోధనలతో ఎందరో నిరక్షరాస్యులు మద్యం, మాంసం మాని ఆధ్యాత్మికత వైపు దృష్టిసారించారని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని పట్నాపూర్ సిద్దేశ్వర ఆలయాన్ని ఆదివారం ఆమె సందర్శించి బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న బాబా ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, బ్లాక్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే, నిర్వాహక కమిటీ సభ్యుడు దుర్రే సుభాష్ తదితరులు ఉన్నారు.

‘సన్’ డే



కౌటాల: జిల్లాలో ఆదివారం భారీగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుంచవెల్లిలో అత్యధికంగా 43.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతుండడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ద్విచక్రవాహనదారులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు వడగాలులకు అల్లాడిపోతున్నారు. సిర్పూర్(యూ) మినహా అన్ని మండలాలు సైతం అలెర్ట్ జోన్‌లో ఉన్నాయి. ఆదివారం వివాహాది శుభకార్యాలు ఉండడంతో తప్పనిసరి ప్రయాణం చేసిన జనం రక్షణ కోసం చర్యలు తీసుకున్నారు. తలపాగా, స్కార్ఫ్‌లు, టోపీలు ధరించారు. శీతలపానీయాల సెంటర్ల, తాటిముంజలు కొనుగోలు చేస్తూ కనిపించారు. సాధారణ ప్రజలతోపాటు వీధి వ్యాపారులు, పనులకు వెళ్లే కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎండ తీవ్రతకు పని ప్రాంతాల్లో ఉండలేని పరిస్థితి కనిపిస్తోంది.

ఆదివారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్టం
కుంచవెల్లి	43.1
తిర్యాణి	42.4
ఆసిఫాబాద్	42.0
ఎల్కపల్లి	42.0
జంబుగా	41.9
వంకులం	41.8
ధనోరా	41.7
దహెగాం	41.2
వాంకిడి	40.7
కౌటాల	40.6



అ‘పూర్వ’ సమ్మేళనం



సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

- 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు
- 19 ఏళ్ల తర్వాత..కలుసుకుని
- విజయనగరం పాఠశాలలో సందడి

కౌటాల: ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి..ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో..వియ్ ఆల్ ద ఫన్..వియ్ ఆల్ ద జాయ్ అంటూ పూర్వ విద్యార్థులంతా తమ గురువులతో కలిసి గత స్మృతులను నెమరేసుకున్నారు. మండలంలోని విజయనగరం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కలియ తిరిగి అనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఫాదర్ జేమ్స్, పూర్వ గురువులు ఎంఎల్ మారయ్య, ఇంద్రదేవి, శ్రీనివాస్‌గౌడ్, సిస్టర్ అలీ, సురేశ్, ఘన్‌శ్యాం, నాగేశ్వర్, శ్రీనివాస్, ఫాదర్ టామ్, వేరోనిక తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



వృత్తిరీత్యా నేను హైదరాబాద్‌లో ఉంటా. ఏదైనా శుభకార్యాలు ఇతర కార్యక్రమాల్లో కేవలం కొద్ది మంది మిత్రులం కలుసుకునేవాళ్లం. ఆత్మీయ సమ్మేళనం కోసం మిత్రులు సమాచారాన్ని సేకరించి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. అందరం ఒకచోట కలుసుకోవడం సంతోషంగా ఉంది.

– అచిన్, హైదరాబాద్

గత స్మృతులు పంచుకున్నాం



19 ఏళ్ల క్రితం నాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. మైసూర్‌లో చర్చి ఫాదర్ కోర్సు చేస్తున్నా. పదో తరగతి పూర్తయ్యాక స్నేహితులందరం విడిపోవడంతో కొందరు టచ్‌లో ఉండేవారు. పూర్వ విద్యార్థులమంతా కలుసుకుని గత స్మృతులను పంచుకున్నాం. – డి సుభాష్, మైసూర్

19 ఏళ్ల అనంతరం




పదో తరగతి పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లడంతో చిన్ననాటి మిత్రులకు దూరమయ్యాం. ఆత్మీయ సమ్మేళనంతో కలవడం ఆనందంగా ఉంది. 19 ఏళ్ల అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఒకే చోట కలిశాం.

– జాన్సీ, గుంటూరు

దగ్గరి దారి.. రాళ్లమయం!



బోరిలాల్‌గూడ నుంచి అంతాపూర్‌కు వెళ్లే రోడ్డు



అంతాపూర్ గ్రామం

- ఇంద్రానగర్, అంతాపూర్ గ్రామస్తులకు రవాణా కష్టాలు
- మండల కేంద్రానికి వెళ్లాలంటే దూరభారం
- 1.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తే ప్రయాణం సులువు
- అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం

కెరమెరి: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర పరిధిలోని సరిహద్దు గ్రామాలు ఇంద్రానగర్, అంతాపూర్ వాసులకు ప్రయాణం నరకంగా మారింది. ఏళ్ల నుంచి బీటీ లేదా సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఆ రెండు గ్రామాలు అంతాపూర్ గ్రామ పంచాయతీలో ఉన్నాయి. అక్కడ 140 కుటుంబాలు ఉండగా..723 జనాభా ఉంది. కాని సులువైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

లేండిగూడ మీదుగా ఇంద్రానగర్

ప్రస్తుతం ఆ గ్రామాల ప్రజలు కెరమెరికి చేరుకోవాలంటే నారాయణగూడ, భోలాపటార్, లేండిగూడ, సాంగ్వి గ్రామాల మీదుగా రావల్సి ఉంది. ఇందుకు 25 కి.మీ దూరం పడుతుంది. మహారాష్ట్ర ప్రభుత్వం భోలాపటార్ నుంచి ఇంద్రానగర్‌కు తారురోడ్డు నిర్మించింది. అదే బోరిలాల్‌గూడ, అనార్‌పల్లి మీదుగా కెరమెరికి చేరాలంటే కేవలం 13 కి.మీ దూరం పడుతుంది. అయితే ఇంద్రానగర్ నుంచి బోరిలాల్‌గూడ వరకు కేవలం 1.5 కి.మీ దూరం మాత్రమే ఉంది. ఇది పూర్తిగా దిగువ ప్రాంతం ఉండడం, రాళ్లరప్పలతో నిండి నడిచేందుకు యోగ్యంగా లేదు. ఆయా గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు, కూరగాయల కొనుగోలు, కార్యాలయాల్లో ఏదైన పని ఉండడం వల్ల ప్రతీరోజు మండల కేంద్రానికి రాకపోకలు సాగుతున్నారు. అయినా1.5 కి.మీ రోడ్డు నిర్మాణం చేపడుదామన్నా చిత్తశుద్ధి ప్రజాప్రతినిధుల్లో లేకపోవడంతో ప్రయాణ కష్టాలు తీరడం లేదు.

ప్రభుత్వంపై గంపెడాశలు..

కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే, ఇతర అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికి వారిలో ఎలాంటి స్పందన లేదని వారు ఆరోపిస్తున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నో హామీలు ఇస్తున్నా ప్రభుత్వం మా గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



మహారాష్ట్ర సర్కారు లేండిగూడ మీదుగా కెరమెరికి నిర్మించిన తారురోడ్డు

దూరభారం తగ్గుతుంది



లేండిగూడ మీదుగా 25 కి.మీ దూరంలో ఉన్న కెరమెరికి వెళ్తున్నాం. అదే బోరిలాల్‌గూడ వరకు 1.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తే దూరభారం చాలా వరకు తగ్గుతుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

– బాజీరావు, ఇంద్రానగర్

తీర్మానం చేయాలి



ఆయా గ్రామాల ప్రజలకు రోడ్డు కోసం తీర్మానం చేసి ఇస్తే కలెక్టర్‌కు నివేదిస్తాం. ఉన్నతాధికారుల నుంచి మంజూరు కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది.

– క్రిష్టారావు, ఎంపీడీవో

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా అర్షద్ హుస్సేన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు స్వార్థప్రయోజనాల కోసం అధికారులతో కుమ్మక్కై తనను చైర్మన్ పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు. హైకోర్టు ద్వారా న్యాయబద్ధంగా చైర్మన్ పదవిని తిరిగి సాధించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండడంతో పాటు యూరియా, డీఏపీ, ఆయా గ్రామాలకు పంపిణీ చేసేలా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో సీఈవో సంజీవ్‌కుమార్, డైరెక్టర్ పేదం శ్రీహరి, నాయకులు ఇంజిరి రాజారామ్, ఖాజామియా, బోళ్లబోయిన శేఖర్, ఆబిద్, దుప్తే శివరాం, బోర్కుట్ తిరుపతి పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ హామీలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి’



బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

రెబ్బెన: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్న విధానాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అమలు, అచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందన్నారు. ఎంపీపీ సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్, వైస్ చైర్మెన్ మహేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు జహురొద్దీన్, మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, జిల్లా నాయకురాలు శంకరమ్మ, ఎంపీటీసీలు సంఘం శ్రీనివాస్, నాయకులు అహల్యాదేవి, పోషం, మల్లేశ్, వినోద్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అడ దస్నాపూర్ గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, నాయకులు కిష్టయ్య, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: కెలిబి గ్రామంతోపాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.



ఆసిఫాబాద్‌రూరల్: ప్రచారం చేస్తున్న రవీందర్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

కౌటాల: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు సక్క శంకర్ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీ ఆర్ఎస్ 14 ఏళ్ల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓ టు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు చారి గోవింద్‌రావు, దుర్గం వెంకటేశ్, శంకర్, మాంగేశ్, శంకరయ్య, తదితరులు ఉన్నారు.



గుడ్లబోరిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రమాదకరంగా రోడ్డు



కెరమెరి: మండలంలోని లేండిగూడకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. లేండిగూడ నుంచి కెరమెరి వస్తున్న దారిలో రోడ్డు కోతకు గురైంది. ఏదైనా వాహనం వేగంగా వస్తే ఇందులో పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే పట్టించుకుని చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.